క్లుప్తంగా

మద్యం దుకాణం తనిఖీ



పులిచెర్ల(కల్లూరు): కల్లూరులోని ప్రభుత్వ మద్యం దుకాణాన్ని చిత్తూరు మద్యం డిపో సబ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణశాస్త్రి ఆదివారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో పని చేసే సిబ్బంది ఏ పొరపాటు చేసినా వారిపై వేటు తప్పదని హెచ్చరించారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ లోకనాథం పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లోని 45 మంది విద్యార్థులకు పీలేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దంత వైద్యులు ఉచితంగా దంత పరీక్షలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ పుష్ప మాట్లాడుతూ పిల్లలు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డెన్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

శాంతిపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియడంతో శాంతిపురం, కనుమలదొడ్డి, బెళ్లకోగిలలోని దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కట్టిన ముసుగులను వైఎస్సార్ సీపీ నేతలు తొలగించారు. అనంతరం స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూజలు చేసి, నివాళులర్పించారు. మండల కేంద్రంలోని విగ్రహం వద్ద జరిగిన పూజల్లో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, నాయకులు దేవేంద్రప్ప, నడింపల్లి చలపతి, సాగర్ పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో మండలంలోని నలుగురికి రూ.6.40 లక్షలు నగదు మంజూరు చేయించారన్నారు. చెక్కులను మంత్రి పీఏ మునితుకారం చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల వేలం నేడు

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ మద్యం రవాణా కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల వ్యాపారులు వాహనాలను పరిశీలించుకుని, ప్రభుత్వ నిబంధనల మేరకు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పలమనేరు: స్థానిక సెబ్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాల విక్రయానికి స్థానిక ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు సెబ్ సీఐ ఎల్లయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే వారు ముందుగా నిర్ణయించిన మేరకు డిపాజిట్ చెల్లించి, వేలంపాటలో పాల్గొనాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

సోమల: మండలంలో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఆదివారం ఇన్‌చార్జి ఎస్‌ఐ మారుతి తెలిపారు. పెద్ద పంజాణి మండలం రాయల్‌పేటకు చెందిన రమణారెడ్డి ఇరికిపెంట డ్యామ్ వద్ద మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి, 20 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టార్గెట్ 175 అజెండా కావాలి

గంగవరం: రానున్న 2024 ఎన్నికల్లో టార్గెట్ 175 అజెండాగా పనిచేయాలని, ఇందుకు ఇప్పటి నుంచే వైఎస్సార్ సీపీ బలోపేతానికి కార్యకర్తలు సంసిద్ధం కావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి సూచించారు. ఆదివారం గంగవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే సైనికుల్లా కష్టపడాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసి రాష్ట్రంలో రెండోసారి ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం రెండు చోట్ల అది కూడా పొత్తులతో గెలుపొందినందుకే టీడీపీ క్యాడర్ అత్యుత్సాహం ప్రదర్శిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యే వెంకటేగౌడని గెలిపించుకుని, సీఎంకు కానుకగా అందించాలన్నారు. అనంతరం మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువాలు కప్పి, ఘనంగా సత్కరించారు.

అకాల వర్షం.. అన్నదాతకు కష్టం



పుంగనూరు: దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి, హెచ్‌ఓ సంతోషికుమారి

పుడమి పుత్రుడిపై ప్రకృతి పగపట్టింది. అన్నదాత నెత్తిన వడగండ్లు పడ్డాయి. కష్టపడి సాగు చేసిన పంట నేలపాలైంది. శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షం..కర్షకుడికి కడగండ్లు మిగిల్చింది.

- 381 ఎకరాల్లో దెబ్బతిన్న పంట
- నేలరాలిన మామిడి, టమాట
- డీహెచ్ఓ మధుసూదన్‌రెడ్డి పరిశీలన

పుంగనూరు: పడమటి నియోజకవర్గంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు రైతులు సాగు చేసిన పలు పంటలు దెబ్బతిన్నాయి. రాత్రి సమయంలో ఒక్కసారిగా గాలి, వడగండ్ల వాన కురవడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. రాళ్లతో సమానంగా ఉన్న వడగండ్లు పడడం చాలా అరుదైన సంఘటనగా రైతులు తెలిపారు. ఈ వడగండ్ల వానకు టమాట, మామిడి, ఇతర కూరగాయల పంటలు నేలరాలాయి. అలాగే పలు లోతట్టు ప్రాంతాల్లో పంటల్లో నీరు నిల్వ చేరింది. దీని కారణంగా సుమారు 450 ఎకరాల్లో దెబ్బతింది. ఆదివారం జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, మండల ఉద్యానవన అధికారి సంతోషికుమారితో కలసి పుంగనూరు నియోజకవర్గం, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లో పర్యటించి, రైతులతో చర్చించారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు పరిశీలన చేసి, నివేదికలు ప్రభుత్వానికి పంపి, రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని సింగిరిగుంట, ఏతూరు, నెక్కుంది, బండ్లపల్లె, మాదనపల్లె పంచాయతీల్లో మామిడి, టమాటతోపాటు కాలిఫ్లవర్ తదితర పంటలు దెబ్బతిన్నాయని హెచ్‌ఓ తెలిపారు. కాగా పంటనష్టాలపై తక్షణమే పరిశీలన జరిపి, అన్ని మండలాల నుంచి రైతుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. నివేదికలను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వడగండ్ల వానకు పలు పంటలు దెబ్బతిన్నాయి. కొళత్తూరు, తుర్లపల్లె, పెద్దారికుంట పంచాయతీల్లోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన టమాట, మామిడి, మిరప, నిమ్మ, క్యాబేజీ పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లి పంటనష్టాన్ని చూసిన రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మండలంలో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు పంటలు దెబ్బ తిన్నాయి. మండలంలో 71.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రైతులు సాగు చేసిన దోస, టమాట, మామిడి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ సర్వర్‌పేటలో 5 ఎకరాలు, బోడిపాటివారిపల్లె ఐదు ఎకరాల దోస పంట పూర్తిగా దెబ్బతింది. రొంపిచెర్లలో మామిడి తోటల్లో కాయలు 90 శాతం నేల రాలాయి. మండలంలోని గానుగచింత, మోటుమల్లెల, బొమ్మయ్యగారిపల్లె, జాండ్లవారిపల్లె, బోడిపాటివారిపల్లె గ్రామాల్లో టమాట, దోస, మామిడి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలో ఆదివారం వేకువ జామున కురిసిన అకాల వర్షం రైతుల పాలిట విషాదం మిగిల్చింది. విపరీతమైన ఈదురు గాలులతోకూడిన వడగండ్ల వర్షం కురిసింది. వర్షం కారణంగా టమాట, కూరగాయలు, మామిడితోపాటు ఖర్బూజ, దోస పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో పుదిపట్ల, చింతమాకులపల్లె, కొండయ్యగారిపల్లె, గడ్డంవారిపల్లె, లద్దిగం తదితర ప్రాంతాల్లో టమాట దెబ్బ తింది. గాలీవాన కారణంగా పిందె దశలో ఉన్న మామిడి కాయలు నేల రాలిపోయాయి. మండల వ్యాప్తంగా సుమారు 100 ఎకరాల్లో పంట దెబ్బతింది.





పెద్దపంజాణి: నేలరాలిన మామిడి కాయలు, కుప్పం: దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఏడీ మురళీకృష్ణ

పలమనేరులో..

పలమనేరు: మండలంలోని మండిపేటకోటూరు, పెంగరగుంట పంచాయతీల్లో శనివారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. సుమారు యాభై ఎకరాల్లో పిందె, పూత నేలరాలింది. కొన్ని తోటల్లో మూడు రోజుల కురిసిన వడగండ్ల వర్షానికి మామిడి కాయలపై మచ్చలు పడ్డాయి.

దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇప్పిస్తాం

కుప్పంరూరల్: మండలంతోపాటు నడుమూరు పంచాయతీలో రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలు, వడగండ్లకు పంట నష్టపోయిన రైతులకు తప్పక నష్టపరిహారం ఇప్పిస్తామని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. ఆదివారం వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆయన మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు హెక్టారుకు రూ.15 వేల పరిహారం ఇప్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం నడుమూరు, వెండుగంపల్లె గ్రామాల్లోన్ని రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అమృతవల్లి, సహాయకులు సౌందర్‌నాయక్, విస్తరణాధికారి బౌరంగ్, శశశంకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు ఘనం



డిగ్రీ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

- పూర్వ విద్యార్థుల నూతన కమిటీ అధ్యక్షుడిగా బాలాజీ

పలమనేరు: పట్టణంలోని శ్రీవత్స చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సేవలు ఘనమైనవని కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నాక్ మూల్యాంకన నేపథ్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా చెంగారెడ్డి, అధ్యక్షుడిగా బాలాజీ, ఉపాధ్యక్షుడిగా పూసల రవి, కార్యదర్శిగా పవన్, సంయుక్త కార్యదర్శిగా బాలాజీ, కోశాధికారిగా కుమార్‌శెట్టి, కార్యవర్గ సభ్యులుగా నూతన్‌ప్రసాద్, నాగరాజు, వరలక్ష్మి, చలపతి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు నారాయణమూర్తి రూ.20 వేలు, హఫీ, హరికృష్ణ ఒక్కొక్కరు రూ.10 వేలు, విక్రమరాజు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. ఈనెల 27న జరిగే నాక్ మూల్యాంకనంలో ఉత్తమ గ్రేడింగ్‌కు పూర్వ విద్యార్థులు గట్టిగా కృషి చేయాలని వైస్ ప్రిన్సిపల్ కోరారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గంగజాతర ప్రారంభం

సదుం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగ జాతర ప్రారంభమైంది. పాలమంద నడివీధి గంగమ్మ ఆలయంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి పూజలు చేసి జాతర ప్రారంభించారు. అరవపాళెం సిలంకూరి ఎల్లమ్మ ఆలయంలో జాతర పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని సదుమమ్మ ఆలయంలో మహిళలు పొంగళ్లు పెట్టి, మొక్కులు చెల్లించారు. అర్ధరాత్రి నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించారు. కంభంవారిపల్లె, రెడ్డివారిపల్లె, బూరగమంద, చెరుకువారిపల్లెలో జాతర సందడి నెలకుంది.

పలువురి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న చర్చి కమిటీ సభ్యులు

పలమనేరు: పట్టణంలోని సీఎస్ఐ చర్చికి సంబంధించి కమిటీ సభ్యులు ఆదివారం తమ సభ్యత్వాలకు రాజీనామా చేసి, ఇందుకు సంబంధించిన పత్రాలను చర్చి చైర్మన్ మిచెల్ సింఘ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు కుమార్, ప్రమీల, అరుణ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ కమిటీలోని కోశాధికారి ప్రవర్తన కారణంగా తాము రాజీనామా చేస్తున్నట్టు పేర్కొన్నారు. సభ్యుల నడుమ తరచూ వివాదాల నేపథ్యంలో ఆదివారం సైతం చర్చిలో వాగ్వాదాలు, గొడవలు జరిగినట్టు వారు తెలిపారు. దీనిపై ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ఏఎస్ఐ పయణి తెలిపారు.

రూ.2.51 కోట్లతో బోయకొండ అభివృద్ధికి చర్యలు

- స్థల పరిశీలన చేసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి
- త్వరగా అభివృద్ధి పనులు పూర్తికి ప్రణాళికలు



బోయకొండలో అభివృద్ధి పనులను పరిశీలించి సూచన లిస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.2.51 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈఓ చంద్రమౌళితో కలిసి అభివృద్ధి పనులు చేపట్టే స్థలాలను పరిశీలించి సూచనలిచ్చారు. యాత్రికుల సౌకర్యార్థం బోయకొండలో రూ.83 లక్షల వ్యయంతో మటన్ కటింగ్ షెడ్డు నూతనంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బోయకొండ గంగమ్మ ఆలయానికి వచ్చే భక్తులు వాహనాలను పార్కింగ్ చేసేందుకు షెడ్, ఇతర వసతుల కల్పనకు రూ.77 లక్షలు వ్యయంతో పనులు చేపట్టినట్లు చెప్పారు. భవానీ నగర్ వద్ద నూతన ముఖద్వారం నిర్మాణానికి రూ.54 లక్షల వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ.37 లక్షల వ్యయంతో యాత్రికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మంత్రి సూచనలతో బోయకొండను ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా, భక్తులకు అన్ని వసతులను కల్పించి ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, నేతలు సోమల మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, గిరిబాబు, డిష్ సూరి, గంగిరెడ్డి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికీ పుష్ప ప్రసాదం

అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడికీ ఉచితంగా అమ్మవారి పాదాల చెంత ఉన్న పుష్పాలు, ప్రసాదంతోపాటు బండారు అందేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి సూచనలతో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి భక్తుడికీ సులభంగా అమ్మవారి దర్శనంతో పాటు అమ్మవారి ఆశీస్సులు పొందేలా చర్యలు చేపట్టామన్నారు.

డ్యాన్స్ పోటీలు రేపు

శాంతిపురం: ఉగాది సందర్భంగా ఈ నెల 21వ తేదీ డుంకుమాకనపల్లె(తుమ్మిశి రోడ్డు)లో డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 నుంచి జరిగే ఈ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుము చెల్లించాలన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు వంతున నగదు బహుమతి అందజేస్తామన్నారు. అలాగే మొత్తం 9 నగదు బహుమతులు, ట్రోఫీలను అందిస్తామన్నారు.

ప్రబోధానంద రచనలు గొప్పవి



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రబోధానంద సేవా సమితి సభ్యులు

కుప్పంరూరల్: త్రైత సిద్ధాంత భగవద్గీత రచయిత శ్రీ ప్రబోధానంద స్వామి వారు తెలుగులో రచించిన రచనలు చాలా గొప్పవని ప్రబోధానంద సేవా సమితి ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం కుప్పం పట్టణంలోని పార్కులో ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రబోధానంద రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత చాలా గొప్పగా ఉందని, ఆయన రచించిన వేలాది పుస్తకాలు హిందూ ధర్మ పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. అనంతరం పట్టణంలోని ప్రముఖులకు ఉగాది తెలుగు క్యాలెండర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్, శరవణ, కృష్ణారెడ్డి, మంజునాథ్, శివ, సుధాకర్, నాగరాజు, వెంకటలక్ష్మి, రాధ పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

రామకుప్పం: మండలంలోని అడవిపాముల బోయినపల్లెకు చెందిన బాలికపై అత్యాచారం జరిగినట్లు బాలిక తండ్రి ఆదివారం రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. లింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న తన కుమార్తెపై నాలుగు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి అత్యాచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒంటరిగా వెళుతున్న తన కుమార్తెను గమనించిన వ్యక్తి పక్కనే ఉన్న మామిడి తోటలోకి బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. స్పృహ కోల్పోయిన తన కుమార్తెను గుర్తించిన కూలీలు సమాచారం అందించారన్నారు. తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ గ్రామానికి వెళ్లి బాధితురాలు, కుటుంబసభ్యులను విచారించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు



నేతల అరెస్టు చూపుతున్న పోలీసులు

గంగవరం: చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతుగా నిలిచిన టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులను గంగవరం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అసెంబ్లీ విలువలకు ఆటంకం కలిగించే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం చట్టరీత్యా నేరమని ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వారిని ముందస్తు అరెస్టు చేసినట్టు ఏఎస్ఐ అస్వర్థ నారాయణ తెలిపారు. తెలుగు యువత నాయకుడు అరుణ్‌కుమార్‌రెడ్డితో పాటు అతని అనుచరులను అరెస్టు చేసి, సొంత పూచికత్తుపై విడుదల చేశామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా ఇందుకు సంబంధించిన నోటీసులు జారీ చేశామన్నారు.

ఘనంగా మోహన్‌బాబు జన్మదినవేడుకలు



కేక్ కట్ చేస్తున్న మోహన్‌బాబు

చౌడేపల్లె: ప్రముఖ సినీ నటుడు, విద్యానికేతన్ విద్యాసంస్థల అధినేత మంచు మోహన్‌బాబు జన్మదిన వేడుకలను ఆదివారం మోహన్‌బాబు అభిమాన సంఘం మండల అధ్యక్షుడు తాతయ్య ఆధ్వర్యంలో చౌడేపల్లెలో ఘనంగా నిర్వహించారు. తొలుత బజారు వీధిలోని శ్రీ అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో మోహన్‌బాబు పేరిట అర్చనలు, అభిషేక పూజలు చేశారు. రోగులకు పాలు రొట్టె, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కుటుంబ సమేతంగా విద్యానికేతన్ ప్రాంగణంలో తాతయ్య కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మోహన్‌బాబుతో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకోరావచ్చని ఆమె పేర్కొన్నారు.

కరి.. మృత్యుకౌగిలి

- పదేళ్లలో కరెంట్‌షాక్‌తో 15 ఏనుగులు బలి
- కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్న గజరాజులు
- మదపుటేనుగులే అధికంగా మృత్యువాత
- తాజాగా కౌండిన్య సరిహద్దులోని తమిళనాడులో మరో కరి బలి



కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఏనుగు(ఫైల్)

అంతరిస్తున్న అడవులు.. ఆహారం కొరత.. వెరసి గజరాజుల మనుగడ మృగ్యం అవుతోంది. ఫలితంగా అవి పంట పొలాల్లోకి వస్తున్నాయి. పలు కారణాలతో మృత్యువాత పడుతున్నాయి. ఇందులో అధికంగా విద్యుద్ఘాతంతో మరణిస్తున్నవే ఎక్కువ.. అందులోనూ ఒంటరి మదపుటేనుగులే అధికం. తాజాగా ధర్మపురి ఫారెస్టు రేంజ్‌లో ఆదివారం ఓ కరి మృతి చెందింది. దీనిపై ప్రత్యేక కథనం.

పలమనేరు: కరెంట్..కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీలోని గజరాజుల పాలిట శత్రువుగా మారింది. మేత కోసం అడవిని దాటి పంటల పైకొచ్చే ఏనుగులు ఎక్కువగా కరెంట్‌షాక్‌లతో మృతి చెందుతున్నాయి. ఆడ ఏనుగుల కంటే ఒంటరిగా తిరిగే మగ ఏనుగులే(మదపుటేనుగులు)ఎక్కువగా విద్యుద్ఘాతానికి గురవుతున్నాయి. తాజాగా కౌండిన్య అడవితో కలసి ఉన్న తమిళనాడు రాష్ట్రం కుప్పానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధర్మపురి ఫారెస్ట్ రేంజ్‌లో ఆదివారం ఓ ఏనుగు జనం చూస్తుండగానే కరెంట్ తీగలు తగిలి, అక్కడికక్కడే మృతి చెందింది.

మదపుటేనుగులే అధికంగా మృత్యువాత

పలమనేరు, కుప్పం, చిత్తూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలో సుమారు 62 వరకు ఏనుగులున్నాయి. దీనికితోడు అటు తమిళనాడులోని మోర్ధన ప్రాంతం, కృష్ణగిరి, ధర్మపురి, కావేరిపట్నం, కర్ణాటకలోని హోసూర్, బన్నేర్‌గట్టల నుంచి తరచుగా కౌండిన్యలోకి ప్రవేశించే సంచార ఏనుగులు 36 వరకు ఉన్నాయి. ఆ లెక్కన స్థానికంగా ఉన్న ఏనుగులతో పాటు సంచారం చేసే గజరాజులను కలుపుకుంటే ఈ ప్రాంతంలో 98 వరకు ఉన్నట్టు అటవీశాఖ అధికారులు లెక్క చెబుతున్నారు. ఇందులో 12 మగ ఏనుగులు గుంపుతో కలిసి ఉండగా 8 ఏనుగులు ఒంటరిగా సంచరించేవి. మొత్తం 20 మగ ఏనుగుల్లో 13 ఏనుగులు గత పదేళ్లలో విద్యుద్ఘాతానికి గురై మృతి చెందగా గత డిసెంబరులో బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లెలో మగ ఏనుగు కరెంట్ షాక్‌కు బలైంది. తాజాగా ఆదివారం ధర్మపురి ఫారెస్ట్‌లో మరో గజరాజు మృతి చెందింది. ఆ లెక్కన కరెంట్ షాక్‌తో ఇప్పటివరకు 15 మగ ఏనుగులు మృత్యువాత పడినట్టు తెలుస్తోంది. మిగిలినవి వివిధ కారణాలతో చనిపోయాయి.

మదపుటేనుగులు యమడేంజర్

కౌండిన్య అభయారణ్యంలో సంచరించే మగ ఏనుగులు (మదపుటేనుగులు) గుంపు నుంచి దూరంగా వచ్చి, ఒంటరిగా ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. ఇవి చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంటాయి. మనుషులు, పశువులు, కుక్కలను తరమి తరిమి చంపడం చేస్తుంటాయి. కొన్నేళ్లల్లో యాదమరి మండలం దిగువకనతల చెరువు వద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్ చంపడం, వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి, ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసరడం, పందేరుపల్లె వద్ద రైతు, కాలువపల్లె వద్ద యువకుడు, పెద్దపంజాణిమండలం పెనుగొలకలకు చెందిన బంగారప్పను చంపాయి.

మూడు రాష్ట్రాల కారిడార్‌తోనే కట్టడి

కౌండిన్య అడవిలో 66 కిలోమీటర్ల మేర సోలార్ ఫెన్సింగ్‌ను గతంలో నిర్మించారు. ఇందులో కొన్ని చోట్ల సోలార్ ఫెన్సింగ్‌కు అమర్చిన బ్యాటరీలు పని చేయక విద్యుత్ ప్రవహించడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ మరీ తేలిగ్గా ఉన్న పైపులు అమర్చడంతో అక్కడక్కడ దీన్ని ఏనుగులు తొక్కి నాశనం చేస్తున్నాయి. అలాగే కౌండిన్యలో 12 చోట్ల 74 కిలోమీటర్లమేర ఎలిఫెంట్ ప్రూఫ్ ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. అయితే ట్రెంచ్‌కి మధ్యలో రాతిబండలు ఉండడంతో అక్కడక్కడ గ్యాప్ లున్నాయి. ట్రెంచ్ వెడల్పు మూడు మీటర్లుగానే ఉంది. ఏనుగులు కొన్ని చోట్ల గుంతల్లో ఉన్న గుట్టలు మీదుగా, లేదా గుంతల్లోకి మట్టిని నింపి వెలుపలికి వస్తున్నాయి. కౌండిన్య అభయారణ్యం మూడు రాష్ట్రాల పరిధిల్లో ఉండడంతో మూడు రాష్ట్రాలు కలసి ఎలిఫెంట్ కారిడార్ ఏర్పాటు చేస్తేనే సమస్యకు శాశ్వతమైన పరిష్కారం దొరుకుతుంది.

కౌండిన్యలో మొత్తం ఏనుగులు:	62
తమిళనాడు నుంచి వచ్చే సంచార ఏనుగులు:	36
మొత్తం కౌండిన్యలో సంచరించేవి:	98
వివిధ కారణాలతో ఇప్పటివరకు మరణించినవి:	20
కేవలం కరెంట్ షాక్‌తో మృత్యువాత పడినవి:	15

మదపుటేనుగులకే ఎక్కువ ప్రమాదాలు



కౌండిన్య అభయారణ్యంతో పాటు పొరుగురాష్ట్రాల్లోని అడవుల్లో సంచరించే మదపుటేనుగులకే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న మాట నిజమే. ఎందుకంటే ఇవి చాలావరకు ఒంటరిగా సంచరిస్తూ కరెంట్ తీగలు, లేదా కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లను తగిలి షాక్‌కు గురై మృతిచెందుతున్నాయి. ఇక్కడి కౌండిన్య అభయారణ్యంలో పాత,కొత్త సోలార్‌ఫెన్సింగ్‌ల మధ్యనున్న గ్యాప్‌లతో పాటు పాత సోలార్ దెబ్బతిన్న చోట్ల మరమత్తులకు ఇప్పటికే రూ.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఫెన్సింగ్ పనులు మొదలుపెట్టేఅవకాశం ఉంటుంది.

–నయీమ్ అలీ, ఎఫ్ఆర్వో, పలమనేరు